సాక్షి
వికారాబాద్

గురువారం । 26 । జనవరి । 2023



కొడంగల్‌పై రేవంత్ ఫోకస్

పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి కొడంగల్ పై ప్రత్యేక దృష్టి సారించారు. గురువారం నియోజకవర్గం లో పర్యటించనున్నారు. 8లో▸



పన్ను వసూలులో ఉదాసీనత

ఆస్తి పన్నుల వసూళ్లపై మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. బిల్ కలెక్టర్ల తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 8లో▸



దిష్టిబొమ్మలా షాపింగ్ కాంప్లెక్స్!

పెద్దేముల్‌లో నిర్మించిన దుకాణ సముదాయం నిరుపయోగంగా మారింది. ఏడాది గడిచినా ఉపయోగంలోకి రావడంలేదు. 9లో▸

న్యూస్‌రీల్

ఓటు హక్కు మరవొద్దు ప్రలోభాలకు లొంగవద్దు

ఓటరు దినోత్సవంలో కలెక్టర్ నిఖిల



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిఖిల

వికారాబాద్ అర్బన్: ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ నిఖిల అన్నారు. 13వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బుధవారం పాఠశాల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 17 ఏళ్లు నిండిన యువత ముందస్తుగా ఫారం–6 ద్వారా ఓటరుగా పేరును నమోదు చేసుకోవాలని, 18 ఏళ్లు నిండిన పిదప ఓటు హక్కును వినియోగించుకోవచ్చని కలెక్టర్ నిఖిల తెలిపారు. ఎన్నికల కమిషన్ ప్రతి ఏడాదిలో నాలుగు సార్లు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తోందన్నారు. ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు వేయాలన్నారు. అనంతరం చీఫ్ ఎలక్షన్ కమిషన్ వారి సందేశాన్ని వీడియో ద్వారా విద్యార్థులకు వినిపించారు. అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎస్‌ఏపీ విద్యార్థి



కేతావత్ వినోద్

అనంతగిరి: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఢిల్లీలో నిర్వహించే పరేడ్‌కు వికారాబాద్ ఎస్‌ఏపీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మందారికా తెలిపారు. కళాశాలలో బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్న కేతావత్ వినోద్ ఎంపికయ్యారన్నారు. ఇప్పటివరకు కళాశాల నుంచి 17మంది ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల అధ్యాపకులు, యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.

దళితబంధు డబ్బులు ఇవ్వాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

అనంతగిరి: దళితబంధు పెండింగ్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మైపాల్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం కలెక్టర్ నిఖిలకు వినతిపత్రం అందజేశారు. దళితబంధు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించాలన్నారు. నియోజకవర్గానికి 500మందికి ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పటికి అన్ని యూనిట్లు అందించలేదన్నారు. ప్రతి నియోజకవర్గానికి 1500 మందికి పారదర్శకంగా అందించాలన్నారు. అపుడే నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందన్నారు. మున్సిపల్ కార్మికులను పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, సుదర్శన్, శ్రీను నాయక్, సురేశ్, శంకర్, యాదయ్య, తేజ, కిరణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించండి

సీఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షుడు గాంగ్యనాయక్



మాట్లాడుతున్న గాంగ్యనాయక్

కుల్కచర్ల: సర్వశిక్షా అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని సీఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షుడు గాంగ్యనాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. సీఆర్పీలుగా విధులను ప్రారంభించి పదేళ్లు కావస్తున్న నేపథ్యంలో దశాబ్ది మహాసభను ఈ నెల 29న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారన్నారు. పదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నా తమకు ప్రాధాన్యం లభించడంలేదని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి తమకు ఎలాంటి సౌకర్యాలను కల్పించడంలేదని తెలిపారు. ఉపాధ్యాయులవలే తాముసైతం విద్యావ్యవస్థలో పనిచేస్తున్నప్పటికీ నామమాత్రపు జీతాలను అందిస్తూ శ్రమదోపిడిని చేస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో సీఆర్పీలు మైపాల్, కృష్ణ, రాజు, మెసెంజర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

రాళ్లతో తూకం.. అంతా మోసం

రాళ్లే బాట్లు.. తూచిందే తూకం.. వారు నిర్ణయించిందే ధర.. వారు ఇచ్చిందే సరుకు.. ఇది జిల్లాలో కొనసాగుతున్నతంతు. వ్యాపార, వాణిజ్య కేంద్రాల్లో ముద్రలేని తూకం రాళ్లు వినియోగిస్తున్నారు. తూకాల్లో తేడాతోపాటు నాణ్యత లేని నిత్యావసర వస్తువులు విక్రయిస్తున్నారు. ఇది జిల్లా వ్యాప్తంగా యథేచ్ఛగా కొనసాగుతోంది. అయినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు మాత్రం తనిఖీలు చేపట్టడం లేదు. దీంతో వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

దరువేస్తున్న దగా
- నాణ్యతలేని వస్తువుల విక్రయం
- కొలతల్లోనూ దోపిడీ
- నష్టపోతున్న వినియోగదారుడు
- జాడలేని తూనికలు, కొలతల శాఖ అధికారులు



సంతలో రాళ్లే బాట్లుగా వినియోగిస్తున్న వ్యాపారి

పరిగి: జిల్లాలోని పట్టణ, మండల కేంద్రాల్లోని కిరాణ, సూపర్ మార్కెట్లు, పలు రకాల దుకాణాలు, మార్కెట్లలో, పంట కొనుగోలు కేంద్రాల్లో త్రాసు, ఎలక్ట్రానిక్ మేయింగ్ మిషన్ల ద్వారా నిర్వహణ కొనసాగుతోంది. నిబంధనల ప్రకారం వ్యాపారులు వినియోగించే బాట్లు, ఎలక్ట్రానిక్ కాంటాలకు లీగల్ మెటలర్జీ అధికారులు తనిఖీ చేసి రెండేళ్ల కాల పరిమితితో లైసెన్సులు జారీ చేయాలి. నిబంధనలు పాటించని వారిపై దాడులు నిర్వహించి జరిమానాలు విధించాలి. అయితే జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఇంతకు అధికారులు ఉన్నారా? లేరా అని ప్రశ్నిస్తున్నారు. కిరాణ దుకాణాల్లో, ఇతర ప్రదేశాల్లో అనుమతిలేని బాట్లు, త్రాసులు వినియోగించి ఒక్కో కిలోకు 150 గ్రాముల నుంచి 200 గ్రాముల వరకు తూకంలో మోసాలకు పాల్పడుతున్నారు. ముద్రలు లేని బాట్లు, తూకం మిషన్లను కొంత మంది వ్యాపారులు వినియోగిస్తుండటంతో అసలు బరువు విషయంలో స్పష్టత ఉండటం లేదు. కిరాణ దుకాణాల్లోని కొన్ని వస్తువులపై ఎమ్మార్పీ, తయారీ చేసిన తేదీ, ఎక్స్‌పైరీ తేదీ, నెట్‌వెయిట్ వివరాలు లేకుండానే విక్రయిస్తున్నారు. పెట్రోల్ బంకుల్లో ఇంధనం నాణ్యతను పరీక్షించేందుకు వినియోగదారులకు బంకుల్లో ఫిల్టర్ పేపర్‌ను అందుబాటులో ఉంచకుండానే నిర్వహిస్తున్నారు.



రాళ్లను బాట్లుగా వేసి కూరగాయలను తూకం వేస్తూ..

ఎలక్ట్రానిక్ కాంటాలతో కుచ్చుటోపి

చాలా చోట్ల వ్యాపారస్తులు ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లను వినియోగిస్తూ వినియోగదారులకు కుచ్చుటోపి వేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. వ్యాపారులు వినియోగించే వేయింగ్ మిషన్లకు మెటలర్జీ అధికారులు నుంచి లైసెన్స్ పొందాలి. వాటిని వేసిన సీల్‌ను తొలగించకుండా వినియోగించుకోవాలి. దుకాణాల్లో ఎలక్ట్రానిక్ కాంటాలు ఉన్నప్పటికీ బాట్లను అందుబాటులో ఉంచాలి. వినియోగదారులకు అనుమానం వస్తే బాట్లతో తూకం చూపించాలి. బాట్లు సైతం అందుబాటులో ఉండాలి. జిల్లాలో అటువంటి పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. పట్టణాల్లో, గ్రామాల్లో తుకాల్లో హెచ్చుతగ్గులు రావడానికి వ్యాపారస్తులు వివిధ రకాల ప్రయత్నాలు చేస్తుండటం గమనార్హం. సీల్ ఉన్న ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషిన్లనే వాడాల్సి ఉండగా ఎలాంటి సీల్ లేకుండానే వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. నిత్యం తూకాల్లో ప్రజలను మోసం చేస్తున్న వ్యాపారస్తులపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు

జిల్లాలోని పలు మండలాల్లో, పట్టణ కేంద్రాల్లో పదార్థాలను తయారు చేసి అమ్మకాలు చేపడుతున్నారు. ప్యాకింగ్ చేసిన కవర్లపై తయారు చేసిన తేదీ, గడువు తేదీ, పరిమాణం, దాని ధరలతో కూడిన వివరాలు ఉండాలి. కానీ ఎటువంటి వివరాలు లేకుండానే పదార్థాలను తయారు చేసి ప్యాకింగ్ చేసి అమ్ముతున్నారు. పాడైపోయిన, కుళ్లిపోయిన వాసన వస్తున్న వాటిని కూడా అమ్ముతున్నట్టు ప్రజలు ఆరోపిస్తున్నారు.

కానరాని అవగాహన..

కల్తీ పదార్థాలు, తూకాల్లో మోసాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో వ్యాపారస్తులు ఇష్టానుసారంగా కొనసాగిస్తున్నారు. తూకాల్లో మోసాలకు పాల్పడుతున్న, అక్రమంగా వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు చర్యలు చేపట్టాలి



పట్టణాల్లో, మండల కేంద్రాల్లో కొనసాగే తూకాల్లో మోసాలు తీవ్రమవుతున్నాయి. పెట్రోల్ బంకుల్లో, ఎలక్ట్రానిక్ కాంటాల ద్వారా వ్యాపారస్తులు ఇష్టానుసారంగా మోసం చేస్తున్నారు. మార్కెటలో కూడా కొంత మంది తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. అధికారులు వెంటనే తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలి.

– చెన్నయ్య, కుల్కచర్ల, వినియోగదారుడు

ఇక ప్రతినెలా డబ్బులు

- శానిటరీ కిట్లకు బదులు స్టైఫండ్
- కేజీబీవీ విద్యార్థినుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ
- ఏడు నెలల డబ్బులు ఒకేసారి విడుదలకు చర్యలు
- విద్యాశాఖ కసరత్తు



వికారాబాద్ అర్బన్: కస్తూర్బా విద్యార్థినులకు ఉపకార వేతనం (స్టైఫండ్) రూపంలో ప్రతి నెలా రూ.వంద బ్యాంకు ఖాతాలో జమచేయనున్నారు. ఈ మేరకు విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. డ్రాప్‌ఔట్ బాలికలను, అనాథ చిన్నారులను, సింగిల్ పేరెంట్ బాలికలను విద్యలో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కస్తూర్బా గాంధీ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్‌తో పాటు, స్కూల్ యూనిఫాం, నెల నెలా శానిటరీ కిట్లను కూడా అందించేది. రెండేళ్లుగా విద్యార్థినులకు శానిటరీ కిట్లు అందలేదు. దీంతో నిరుపేద విద్యార్థులు రోజువారిగా ఉపయోగించే సబ్బులు, కొబ్బరినూనె, కాస్మొటిక్ వంటి వస్తువులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటి వరకు కొందరు తల్లిదండ్రులే ఈ ఖర్చును భరిస్తూ వస్తున్నారు. ఈ ఇబ్బందుల నుంచి విద్యార్థులకు ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వమే ప్రతి నెలా స్టైఫండ్ రూపంలో వారి ఖాతాల్లో రూ. 100 జమచేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ డబ్బులతోనే వారికి అవసరమైన వస్తువులు కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే ప్రతి విద్యార్థిని వ్యక్తిగత బ్యాంక్ ఖాతా తెరవాలని విద్యాశాఖ ఆదేశాలు జారి చేసింది.

నాలుగు వేల మందికిపైగా లబ్ధి..

జిల్లాలో 18 కేజీబీవీలు ఉండగా అందులో 6 నుంచి 12వ తరగతి వరకు 4,386 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వికారాబాద్, తాండూరు కేజీబీవీల్లో ఇంటర్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆయా కేజీబీవీల ఎస్‌ఓలు ప్రత్యేక చొరవ తీసుకొని పోస్టాఫీస్ ఇతర బ్యాంకుల్లో ఖాతాలు తెరిపించారు. ఒక్కో విద్యార్థినికి గత ఏడాది జూన్ నుంచి నెలకు రూ. 100 చొప్పున ఏడు నెలల డబ్బులు రూ. 700 ఒకేసారి జమచేయనుంది. సంబంధిత అధికారులు ఈ ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించారు. బాలికలకు శానిటరీ కిట్లకు బదులుగా స్టైఫండ్ ఇవ్వడంపై విద్యార్థినిల తల్లిండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బాలికలకు ప్రతి నెలా స్టైఫండ్ బదులుగా పరిశుభ్రత కిట్లు ఇవ్వాలనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొబ్బరినూనె, సబ్బుల ధరలు విపరీతంగా పెరిగి పోవడంతో ప్రభుత్వం ఇచ్చే రూ. 100 దేనికి సరిపోవని అంటున్నారు. ప్రభుత్వం నగదుతో పాటు శానిటరీ కిట్లను అందించాలని కోరుతున్నారు.

కేజీబీవీలు	-	18
విద్యార్థులు	-	4386
ఒక్కో విద్యార్థికి స్టైఫండ్	-	100
నెలనెలా వచ్చే నిధులు	-	4,38,600

సూచనలు పాటించండి.. లాభాలు పొందండి

జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

పరిగి: సాగులో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తప్పకుండా పాటించి లాభాలను పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని లఖ్నాపూర్‌లో యాసంగి పంట సాగును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యాసంగిలో ఎక్కువ శాతం రైతులు వరి పంటను సాగు చేస్తున్నారన్నారు. వాతావరణంలో చలి అధికంగా ఉండటం వల్ల నారు మడిలోని నీటిని ప్రతి రోజు మార్చాలని సూచించారు. నారుమడిలో 10కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్‌ను లేదా 50 కిలోల ఎరువును ఒక గుంట నారుమడికి చల్లాలని సూచించారు. వరి నారును చిక్కు మాదిరిగా కాకుండా సాళ్ల పద్ధతిలో 10 ఇంచుల దూరంలో నారును వేసుకోవాలని తెలిపారు. సాళ్ల నారుతో అధిక లాభాలు ఉండాయని, పెట్టుబడి కూడా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో రైతు బంధు కోఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.



పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

బాలకేంద్రానికి వెలుగులు



వికారాబాద్‌లోని బాలకేంద్రం

- ఎట్టకేలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

వికారాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని బాలకేంద్రానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. బిల్లులు చెల్లించకపోవడంతో ఐదేళ్లుగా కరెంట్ సరఫరాను నిలిపివేశారు. కలెక్టర్ నిఖిల ప్రత్యేక చొరవతో బాలకేంద్రానికి విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. దీంతో బాలకేంద్రంలో చిన్నారులు విద్యుత్ కాంతుల మధ్య శిక్షణ పొందుతున్నారు. కోవిడ్ కంటే రెండేళ్ల ముందు నుంచే విద్యుత్ సరఫరా బంద్ చేశారు. ప్రస్తుతం రూ.30వేల పైచిలుకు విద్యుత్ బకాయిలు ఉండటంతో ఈ విషయాన్ని బాలకేంద్రం ఇన్‌చార్జి శ్రీకాంత్ ఇతర సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కలెక్టర్ తన ప్రత్యేక నిధుల నుంచి బిల్లులు చెల్లించారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా కొనసాగించారు. బాలకేంద్రం సిబ్బంది, విద్యార్థులు కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

స్వగ్రామానికి వస్తుండగా..

రోడ్డు ప్రమాదంలో జవాన్ దుర్మరణం



వెంకటేశ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, నాయకులు

బొంరాస్‌పేట: స్వగ్రామానికి వస్తున్న ఓ జవాన్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ ఘటన దుద్యాల మండలంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేడ్ గ్రామానికి చెందిన బడుసు వెంకటేశ్ (24) ఇండియన్ ఆర్మీలో సైనికుడిగా పనిచేస్తున్నారు. కొడంగల్ నుంచి సొంత గ్రామానికి కారులో వస్తుండగా గ్రామ సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందగా కారులో ఉన్న ఇద్దరు స్నేహితులు శ్రీనివాస్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని కొడంగల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనాస్థలంలో వెంకటేశ్ మృతదేహం

ఎమ్మెల్యే ఘన నివాళి

కొడంగల్ రూరల్ : విషయం తెలిసిన ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బుధవారం సాయంత్రం ఆలేడ్ గ్రామానికి చేరుకొని జవాన్ వెంకటేశ్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ అందేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పకీరప్ప, కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, కోఆప్షన్ మెంబర్ మొఖ్తార్, దత్తురెడ్డి, నియోజకవర్గ ఆర్మీ యూనియన్ సభ్యులు, ఆలేడ్, హస్నాబాద్ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఖాతాల్లోనే రైతుబంధు డబ్బులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు కుమ్మరి అనిత. కొడంగల్ మండలం ఉడిమేశ్వరం గ్రామానికి చెందిన మహిళా రైతు. ఈమెకు ఐదు ఎకరాల పొలం ఉంది. ఈమె పేరు మీద పట్టణంలోని ప్రముఖ బ్యాంకులో క్రాప్‌లోన్ ఉంది. కుటుంబ సమస్యల వల్ల క్రాప్‌లోన్ చెల్లించడంలో జాప్యం జరిగింది. దీంతో ఈమె బ్యాంకు ఖాతాను అధికారులు హోల్డ్‌లో ఉంచారు. ప్రభుత్వం నుంచి వచ్చిన రైతు బంధును తీసుకునే అవకాశం లేకుండా చేశారు. ఏడాదిన్నర నుంచి మూడు సార్లు వచ్చిన రైతు బంధు డబ్బులు బ్యాంకు ఖాతాలోనే ఉన్నాయి. ఈ సమస్య అనిత ఒక్కరిదే కాదు. కమర్షియల్ బ్యాంకుల్లో క్రాప్‌లోన్ తీసుకున్న ఎంతో మంది రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.



వరి నాట్లకు సిద్ధమైన నారు మడులు

- రెన్యువల్ చేసుకోలేదని బ్యాంకర్ల కొర్రీలు
- మిత్తి చెల్లించాలని ఒత్తిడి
- సర్కార్ ఇచ్చిన పైసలకు ఎసరు

కొడంగల్: పంట రుణం మాఫీ అవుతుందని ఒకవైపు ఆశ.. మిత్తి పైసలు చెల్లించలేని నిస్సాహయత మరో వైపు.. వెరసీ క్రాప్ లోన్ రెన్యూవల్‌లో ఆలస్యం జరుగుతోంది. తీసుకున్న రుణానికి వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని బ్యాంకు అధికారుల ఒత్తిడి. అప్పటి వరకు రైతు బంధు డబ్బులు తీసుకోవడం కుదరదని తేల్చి చెప్పిన బ్యాంకు అధికారులు. చేసేది లేక నిరాశలో చాలా మంది రైతులు ఉన్నారు. రైతు బంధు డబ్బులను పంట రుణాలకు జమ చేయరాదని ప్రభుత్వం చెబుతున్నా బ్యాంకర్లు వినడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్

జిల్లా వ్యాప్తంగా బ్యాంకర్లు ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా రైతుల ఖాతాలను హోల్డ్‌లో ఉంచుతున్నారు. దీంతో పెట్టుబడి సాయం కోసం రైతులు ప్రయివేటు వ్యక్తుల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తోంది. పంట రుణాల చెల్లింపు కోసం రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా రైతు బంధు సాయం అందించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి.అయినా బ్యాంకర్లు ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోవడం లేదు. గతంలో రైతులు పంట రుణాలు తీసుకొని గడువు లోగా తిరిగి చెల్లించడమో లేక వడ్డీ చెల్లించి రుణం రెన్యూవల్ చేసుకోవడమో చేసేవారు. అయితే ప్రభుత్వం రైతులకు పంట రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించి నేటికీ చేయకపోవడంతో ఈ సమస్యలు వస్తున్నాయి.

రుణమాఫీ కోసం ఎదురుచూపులు..

ప్రభుత్వం మొదటి విడతలో రూ25వేల రుణం మాఫీ చేసింది. రెండో విడతలో రూ.50వేల రుణం మాఫీ చేస్తామని ప్రకటించారు. జిల్లాలో రూ.50వేల క్రాప్ లోన్ తీసుకున్న రైతులకు ఇంకా మాఫీ రాలేదు. పూర్తి స్థాయిలో మాఫీ కాలేదు. లక్షలోపు రుణం తీసుకున్న రైతు రుణమాఫీపై స్పష్టత రాలేదు. బ్యాంకర్లు మాత్రం కనీసం వడ్డీ చెల్లించి రుణాలు రెన్యూవల్ చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు. రైతులు వినకపోవడంతో రైతుల ఖాతాలను నిలిపి వేస్తున్నారు. బ్యాంకు రుణం చెల్లిస్తేనే ఖాతాలు పనిచేస్తాయని స్పష్టం చేస్తున్నారు. జిల్లాలో ఉన్న జాతీయ సహకార, ప్రయివేటు రంగాలకు చెందిన బ్యాంకులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. అధికారులు స్పందించి రైతుబంధు సాయం రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

వీఆర్‌ఓ కుటుంబాన్ని ఆదుకోవాలి



వీఆర్‌ఓ అంత్యక్రియల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

పెద్దేముల్‌: అనారోగ్యంతో మృతి చెందిన వీఆర్‌ఏ బాలు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్‌ కోరారు. బుధవారం మండలంలోని గోట్లపల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన బాలు అంత్యక్రియల్లో ఆయన పాల్గొన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ రాజిరెడ్డి అంత్యక్రియల నిమిత్తం నగదు అందజేశారు.

28న రథసప్తమి



అనంతగిరి: వికారాబాద్‌ పట్టణ సమీపంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో వెలిసిన సూర్య దేవాలయంలో ఈనెల 28న రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 5గంటలకు అభిషేకం, గణపతి పూజ, 10గంటలకు హోమం, 12.30 గంటలకు పల్లకీసేవ, రెండు గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

వ్యాన్‌ బోల్తా.. వ్యక్తి మృతి

మరో ఇద్దరికి గాయాలు



బోల్తాపడిన వాహనం



రెడ్డిరాజు (ఫైల్‌)

దౌల్తాబాద్‌: డీసీఎం వ్యాన్‌ బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన దౌల్తాబాద్‌ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చల్లాపూర్‌కు చెందిన బద్ది బుద్దెయ్య వ్యాపార నిమిత్తం గ్రామానికి చెందిన రెడ్డిరాజు డీసీఎం వాహనాన్ని కిరాయికి మాట్లాడుకున్నాడు. కుటుంబ సభ్యులతో వ్యాన్‌లో మొత్కుపల్లి జాతరకు బయలుదేరాడు. దౌల్తాబాద్‌ సమీపంలోకి వాహనం రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రెడ్డిరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. వాన్‌ లోపల కూర్చున్న బుద్దయ్యకు కాలు విరిగింది. మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కొడంగల్‌ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యులు సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్‌ దాసు తెలిపారు.

వాహనం ఢీకొని హోంగార్డ్‌ మృతి



శ్రీనివాస్‌(ఫైల్‌)

కుల్కచర్ల: విధులు నిర్వహిస్తున్న క్రమంలో వాహనం ఢీ కొని హోంగార్డ్‌ మృతి చెందాడు. ఈ సంఘటన కండ్లకోయ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కుల్కచర్ల మండలం చాపలగూడెం గ్రామానికి చెందిన జీ శ్రీనివాస్‌(35) మేడ్చల్‌ – మల్కాజిగిరి జిల్లా పరిధిలోని కండ్లకోయ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం ట్రాఫిక్‌ విధులు నిర్వహిస్తుండగా ట్రక్‌ ఢీ కొంది. ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. హోంగార్డ్‌ మృతితో చాపలగూడెంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్య సునిత, ఒక పాప, ఒక బాబు ఉన్నారు.

కొడంగల్‌పై రేవంత్‌ ఫోకస్‌

- అన్ని మండలాల్లో పర్యటన
- నేడు మదనపల్లి నుంచి శ్రీకారం
- కొడంగల్‌లో భారీ ఊరేగింపు



రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు

కొడంగల్‌: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కొడంగల్‌ నియోజకవర్గంపై దృష్టి సారించారు. నాలుగేళ్లుగా కొడంగల్‌పై సైలెంట్‌గా ఉన్నారు. ఈ ప్రాంత ప్రజలపై ఆయనకు నమ్మకం, అభిమానం ఎక్కువ. రేవంత్‌ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందడంతో కొంతమేరకు నిరాశ చెందారు. తాను నమ్ముకున్న ప్రజలు తనను ఓడించారని బాధ పడ్డారు. అయినా కాంగ్రెస్‌ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉన్నారు. రేవంత్‌ సోదరుడు తిరుపతిరెడ్డి నాలుగేళ్ల నుంచి నియోజకవర్గంలో పర్యటిస్తూ కార్యకర్తలకు అండగా ఉన్నారు. 2009, 2014 ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి కొడంగల్‌ ఎమ్మెల్యేగా గెలిచారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌ ఓటమి చెందారు. టీఆర్‌ఎస్‌ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి విజయం సాధించారు.

కలిసొచ్చిన మదనపల్లి

బొంరాస్‌పేట మండలం మదనపల్లి గ్రామం నుంచి రేవంత్‌ ఎన్నికల ప్రచారం ప్రారంభించడం ఆయనకు సెంటిమెంట్‌గా వస్తోంది. గతంలో కూడా ఆయన రెండు సార్లు అక్కడి నుంచి ప్రచారం ప్రారంభించి విజయం సాధించారు. గత ఎన్నికల్లో రేవంత్‌ తెలంగాణ రాష్ట్ర బాధ్యతలు తీసుకొని కొడంగల్‌కు సమయం ఇవ్వలేకపోయారు. ఎన్నికల ప్రచారం కూడా అనుకున్న స్థాయిలో జరగలేదు. దీంతో ఆయన ఓటమి చెందినట్లు అభిమానులు, కార్యకర్తలు అంటున్నారు. ఈ సారి ముందస్తుగా ఎన్నికల ప్రచారానికి తెర లేపారు. నియోజకవర్గానికి మదనపల్లి గ్రామం ఈశాన్య దిక్కున ఉంది. ఈశాన్య దిక్కు నుంచి ప్రచారం చేయాలని 2009లో అప్పటి పురోహితులు చెప్పారు. దాన్ని పాటించిన ఆయన విజయం సాధిస్తూ వచ్చారు.

మండలాల పర్యటనకు సిద్ధం

గురు, శుక్రవారం రెండు రోజుల పాటు రేవంత్‌ కొడంగల్‌ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. గురువారం మధ్యాహ్నం బొంరాస్‌పేట మండలం మదన్‌పల్లిలో హాత్‌ సే హాత్‌ జోడో కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అనంతరం బొంరాస్‌పేట మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు దుద్యాల మండలం, సాయంత్రం 5 గంటలకు కొడంగల్‌ మండలం, 27వ తేదీ ఉదయం 10 గంటలకు దౌల్తాబాద్‌ మండలం, 11 గంటలకు మద్దూరు మండలం, 12 గంటలకు కొత్తపల్లి మండలం, ఒంటి గంటకు గుండుమాల్‌, 3 గంటలకు కోస్గిలో కాంగ్రెస్‌ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు. గురువారం సాయంత్రం ఐదు గంటలకు కొడంగల్‌లో భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌ పార్టీ గెలుపు కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చిస్తారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలకు అనుగుణంగా పార్టీ క్యాడర్‌ను సిద్ధం చేయడానికి రేవంత్‌ శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ఇది ఎన్నికల ఏడాది కావడంతో రాజకీయం రసవత్తరంగా ఉంటుంది. రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉంది. రాజకీయ నాయకులు ఎవరు ఎవరి పక్షాన ఉంటారో, ఎవరు వ్యక్తిగతంగా ఉంటారో ప్రస్తుతం అనిశ్చితి నెలకొంది. త్వరలో కొడంగల్‌ రాజకీయ పటంలోకి కొత్తముఖాలు వచ్చే అవకాశం ఉంది.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి



పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని దాతాపూర్‌లో బుధవారం రూ. 20 లక్షలతో పంచాయతీ భవనం, రూ. 30లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు గ్రామాల్లో సమస్యలు తాండవం చేసేవని, నేడు అభివృద్ధితో కళకళలాడుతున్నాయని అన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువలు, పార్కులు, నర్సరీలు, క్రీడా ప్రాంగాణాలు, డంప్‌ యార్డులు నిర్మించినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్‌ అమలు చేస్తున్న పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలతో గ్రామాల రూపు రేఖలు మారిపోతున్నాయని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమల్లో రాష్ట్రం దేశానికే ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భవాని, ఏఎంసీ చైర్మన్‌ ప్రశాంత్‌గౌడ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ రాంరెడ్డి, ఎంపీడీఓ సుమిత్రమ్మ, పీఆర్‌డీఈ మాధవరెడ్డి, ఏఈ లక్ష్మయ్య, సర్పంచులు బల్వంత్‌రెడ్డి, విజయలక్ష్మి, విమలమ్మ, ఎండీ రఫీ, సుభాన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌, నర్సింహారెడ్డి, రత్నం, సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ పద్మ, పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు చిట్టెపు మల్లారెడ్డి, రంగారెడ్డి, ప్రకాశం, బుచ్చయ్య, నర్సింలు, శాంతకుమార్‌, అంజయ్య, బోజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు సిద్ధమవుతున్న ధాన్యం



తిరుమల తిరుపతి దేవస్థానం కోసం వడ్లను సిద్ధం చేస్తున్న దృశ్యం

ధారూరు: తిరుమల తిరుపతి దేవస్థానానికి పంపేందుకు రెండు రకాల ధాన్యం సిద్ధమవుతోంది. దేవకి, మాపిల్లై సాంబార్‌ రకం ధాన్యాన్ని ఎలాంటి రసాయన మందులు, ఎరువులు వాడకుండా పండించారు. బుధవారం వడ్లు సేకరించే పనులను ప్రారంభించారు. రెండు సంవత్సరాల నుంచి జిల్లాలోని ధారూరు మండలం బుర్గుగడ్డ వ్యవసాయ క్షేత్రం నుంచి ధాన్యాన్ని సేకరించి తిరుమల తిరుపతి దేవస్థానానికి పంపుతున్నారు. ఈ క్షేత్రంలో 32 రకాల వడ్లను ఎలాంటి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకుండా పండిస్తున్నారు. ఇక్కడ పండిన వడ్లను బియ్యంగా తయారు చేసి నగరంలోని ఇందిరాపార్కు వద్ద ఏర్పాటు చేసిన షాప్‌ ద్వారా ప్రజలకు విక్రయిస్తున్నారు. ఆర్గానిక్‌ బియ్యం కావడంతో చాలామంది వీటిని కొనుగోలు చేస్తున్నారు.

ప్రమోషన్లలో పారదర్శకత పాటించాలి

టీఎస్‌ యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం



డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతగిరి: సీనియారిటీ ఆధారంగా ఉపాధ్యాయుల ప్రమోషన్లు చేపట్టాలని టీఎస్‌ యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం కోరారు. బుధవారం ఈ మేరకు వికారాబాద్‌ పట్టణంలో డీఈఓను కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖ జిల్లా అధికారులు ప్రమోషన్ల పరిశీలనకు రూపొందించిన సీనియారిటీ జాబితాలో మొదటి నియామకం తేదీ, డీఎస్సీ, సామాజికవర్గం, అంగవైకల్యం పరిగణలోకి తీసుకోకపోవడంతో అన్ని క్యాడర్ల ఉపాధ్యాయులు అయోమయంలో పడ్డారని తెలిపారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఉపాధ్యాయుల సీనియారిటీని గుర్తించడంలో క్యాడర్ల వారీగా అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. సీనియారిటీ అవకాశం ఉన్నా జాబితాలో పేర్లు లేకపోవడంతో సందిగ్ధతకు గురి అవుతున్నారని పేర్కొన్నారు. పరిశీలన జాబితాలో స్పష్టమైన తేదీ లేకపోవడంతో అవకతవకలకు అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. సీనియారిటీని పొందుపరిచి పారదర్శకంగా కొత్త జాబితాను ప్రకటించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబురావు, రత్నం, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆద్యంతం.. ఆసక్తికరం

- వాడీవేడిగా మున్సిపల్‌ కౌన్సిల్‌ సమావేశం
- 41 అంశాల్లో 35కు ఆమోదం



కౌన్సిల్‌ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్‌ తాటికొండ స్వప్న

తాండూరు: మున్సిపల్‌ కౌన్సిల్‌ సమావేశం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఏడాది తర్వాత చైర్‌పర్సన్‌ తాటికొండ స్వప్న అధ్యక్షతన బుధవారం కౌన్సిల్‌ సమావేశం జరిగింది. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన సమావేశం సాయంత్రం 5 వరకు సాగింది. 41 అంశాలతో రూపొందించిన ఎజెండాను కౌన్సిల్‌ సభ్యుల ఆమోదానికి ప్రవేశపెట్టారు. అందులో 35 అంశాలను కౌన్సిల్‌ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 6 అంశాలను 16 మంది కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. 20 మంది తిరస్కరించారు. తిరస్కరించిన వాటిలో 10, 11, 13, 34, 37 ,41 అంశాలు ఉన్నాయి. నిధుల కేటాయింపు సరిగ్గా లేని కారణంగా తిరస్కరించారు. అభివృద్ధి పనులకు శిలాఫలకాలు ఏర్పాటు చేసేందుకు రూ. 20లక్షలు కేటాయిస్తారా అని పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిధులతో ప్రజలకు ఉపయోగపడే పనులు చేస్తే మంచిదని పేర్కొన్నారు. మున్సిపల్‌ నూతన కార్యాలయంలో రూ. 30 లక్షలతో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లుల కోసం తీర్మానం ప్రవేశపెట్టారు. మెజార్టీ సభ్యుల ఆమోదం లేకుండా పనులు ఎలా చేస్తారంటూ బిల్లును వ్యతిరేకించారు. మరోవైపు నూతన భవనంలో అసంపూర్తి పనులకు రూ.1.45 కోట్లు కేటాయింపులో స్పష్టత లేదని వ్యతిరేకించారు. 41వ అంశంలో 36 వార్డులకు రూ. 14.40 కోట్లు కేటాయింపు సరిగ్గా లేదని వ్యతిరేకించారు. వీటి ఆమోదం కోసం చైర్‌పర్సన్‌ వర్గం, కౌన్సిలర్లు బీజేపీ కౌన్సిలర్లతో సంప్రదింపులు జరిపారు. దీని కోసం సమావేశాన్ని పలు సార్లు వాయిదా వేశారు. ఎజెండా సరిగ్గా లేదని కౌన్సిలర్‌ ఆసీఫ్‌ చైర్‌పర్సన్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో సమావేశం నుంచి కొంత సేపు ఆయన్ను సస్పెండ్‌ చేశారు. అయితే మెజారిటీ సభ్యులు సస్పెండ్‌ చేయడాన్ని వ్యతిరేకించడంతో తిరిగి కౌన్సిల్‌ సమావేశంలోకి వచ్చారు. అయితే కొన్నాళ్లుగా వివాదాస్పదంగా మారిన మున్సిపల్‌ కార్మికుల సమస్యలకు సంబంధించి ప్రవేశ పెట్టిన అంశాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఏడాది కాలంగా వేతనాల పెంపు కోసం ఎదురు చూస్తున్న కార్మికులకు కౌన్సిల్‌ సభ్యుల ఆమోదం తెలపడంతో ఊరట లభించింది. మున్సిపాలిటీలో కుక్కల బెడద ఎక్కువైందని పలువురు కౌన్సిలర్లు సభ దృష్టికి తెచ్చారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని చైర్‌పర్సన్‌ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్‌ చైర్‌పర్సన్‌ దీప, ఫ్లోర్‌ లీడర్లు శోభారాణి, వరాల శ్రీనివాస్‌రెడ్డి, అంతారం లలిత, సాజీద్‌ అలీ, సోమశేఖర్‌, మేనేజర్‌ నరేందర్‌రెడ్డి, డీఈఈ రంగనాథం, ఏఈ ఖాజాహుస్సేన్‌, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ ఉమేష్‌, టీపీఎస్‌లు జీషాన్‌, లాలప్ప, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూలులో ఉదాసీనత

- ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా చేరుకోని లక్ష్యం
- రూ. 8.11కోట్లకు గాను రూ. 2.64 కోట్లే వసూలు



తాండూరు మున్సిపల్‌ కార్యాలయం

తాండూరు: మున్సిపాలిటీల నిర్వహణ ప్రధానంగా ఆస్తి పన్నులపై ఆధారపడి ఉంటుంది. అలాంటి పన్నుల వసూలుపై మున్సిపల్‌, రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి నెలా పన్నులు వసూలు చేయాల్సిన బిల్‌ కలెక్టర్లు తమ విధులను విస్మరించి కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడు బకాయిలు పెరిగిపోవడం గమనార్హం. తాండూరు మున్సిపల్‌ నిర్వహణ గాలిలో దీపంలా మారింది. రెండేళ్లుగా పూర్తి స్థాయి కమిషనర్‌ లేకపోవడంతో పాలక కుంటుపడింది. మున్సిపాలిటీలో రెవెన్యూ విభాగం ప్రధానమైంది. అయితే ఏడాది కాలంగా రెవెన్యూ అధికారి పోస్ట్‌ ఖాళీగా ఉంది. దీంతో ఇన్‌చార్జ్‌ బాధ్యతలను మేనేజర్‌ నరేందర్‌రెడ్డి చూసుకుంటున్నారు. తాండూరు మున్సిపాలిటీలో మొత్తం 13,986 ఆవాస, నివాస గృహాలు ఉన్నాయి. 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో రూ. 8.11కోట్ల వరకు ఆస్తి పన్నుల వసూలు చేయాలి. అయితే జనవరి 22వ తేదీ నాటికి రూ. 2.64కోట్లను మాత్రమే వసూలు చేశారు. ఇంకా 5.47కోట్ల పన్ను బకాయిలు పేరుకుపోయాయి. ఈ ఆర్థిక సంవత్సరం మరో రెండు నెలల్లో ముగియనుంది. అయితే ఇప్పటి వరకు 50శాతం కూడా దాటని పరిస్థితి నెలకొంది.

బిల్‌ కలెక్టర్ల ఇష్టారాజ్యం

మున్సిపాలిటీలో బిల్‌ కలెక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ 8 మంది బిల్‌ కలెక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. వారికి కేటాయించిన వార్డుల్లో బిల్లులు వసూలు చేయాలి. కానీ ఇతర వ్యాపకాలతో పన్నుల వసూలును పక్కన పెట్టారనే విమర్శలు వస్తున్నాయి. ఇన్‌చార్జ్‌ రెవెన్యూ అధికారిగా ఉన్న మేనేజర్‌ నరేందర్‌రెడ్డికి పని ఒత్తిడి పెరగడం వల్ల పూర్తిస్థాయిలో పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టలేకపోతున్నారు. ఇన్‌చార్జ్‌ కమిషనర్‌ ఉన్న ఆర్డీఓకు తన బాధ్యతలతో పాటు కలెక్టర్‌ కార్యాలయంలో అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల కార్యాలయ నిర్వహణ పరిస్థితి గాడితప్పింది.

ప్రభుత్వ ఆస్తులకు పన్ను చెల్లించని అధికారులు

మున్సిపల్‌ పరిధిలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఆస్తి పన్నులు మొండి బకాయిలుగా మారాయి. కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన ఆస్తుల పన్నుల ద్వారా రూ. 20.87లక్షలు రావాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు పన్నులు చెల్లించలేదు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మండల పరిషత్‌ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ, నీటి పారుదల శాఖ, పోలీస్‌స్టేషన్‌, వసతి గృహాలు, అటవీ శాఖలతో పాటు తదితర శాఖల నుంచి లక్షల్లో ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయి. మరోవైపు భావిగి భద్రేశ్వర దేవాలయం, పోట్లి మహరాజ్‌ దేవాలయాలకు చెందిన ఆస్తుల పన్నులు వసూలు చేయలేదు.

ఆదేశాలు జారీ చేశాం



ఆస్తి పన్ను వసూలు చేయాలని బిల్‌ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశాం. ఇప్పటి వరకు 2.64కోట్ల పన్ను వసూలు చేశాం. మరో రెండు నెలల వ్యవధిలో లక్ష్యం చేరుకుంటాం. అందుకోసం బిల్‌ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

– నరేందర్‌రెడ్డి, మేనేజర్‌, తాండూరు మున్సిపల్‌

దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్‌: పట్టణ సమీపంలోని నూర్‌ ఇంజనీరింగ్‌ కళాశాల భవనంలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల(నాగర్‌కర్నూల్‌)లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం టీజీయూజీ సెట్‌ అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియెట్‌ సెకండియర్‌ విద్యార్థులు ఫిబ్రవరి 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్‌.కామ్‌ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

యువకుడి అదృశ్యం

పహాడీషరీఫ్‌: మానసిక స్థితి సరిగ్గా లేని ఓ యువకుడు కనిపించకుండా పోయాడు. ఈ సంఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. వాదే ముస్తఫా బస్తీకి చెందిన మహ్మద్‌ ఇబ్రహీం కుమారుడు మహ్మద్‌ ఖాజా (21)కు మానసిక స్థితి సరిగ్గా లేదు. ఈనెల 20వ తేదీన సాయంత్రం 4 గంటల సమయంలో ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లిన మహ్మద్‌ ఖాజా తిరిగి ఇంటికి రాలేదు. ఈ విషయమై అతని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆరు నెలల క్రితం కూడా ఇలాగే బయటికి వెళ్లిన అతను 20 రోజుల అనంతరం తిరిగొచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

‘పది’లో పట్టు సాధించేలా బోధన




కద్మూరు పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న సిబ్బంది

- ఉత్తమ గ్రేడ్లు సాధించేలా ప్రత్యేక తరగతులు
- ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి

పూడూరు: పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతతోపాటు ఉత్తమ గ్రేడ్లు సాధించేలా ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మండలంలోని 10 జిల్లా పరిషత్‌, మోడల్‌ స్కూల్‌, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలల్లో 469 మంది విద్యార్థులు, రెండు ప్రైవేటు స్కూళ్లలో మరో 162 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. పూడూరు, చన్గోముల్‌, మన్నెగుడ ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. రెండు నెలల నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8.30 నుంచి 9.30గంటల వరకు అలాగే సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులను గ్రూపులుగా విభజించి బోధన చేస్తున్నారు. మధ్యాహ్నం పరీక్షలు నిర్వహిస్తున్నారు.


స్టడీ మెటీరియల్‌ అందజేస్తున్నాం



పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ అందజేస్తున్నాం. పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నాం. అన్ని సబ్జెక్టుల్లో ప్రతిభ కనబరిచేలా బోధన చేస్తున్నాం. గణితం, ఆంగ్లంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను బహుమతులతో ప్రోత్సాహిస్తున్నాం.

– జహంగీర్‌, ఉపాధ్యాయుడు, పూడూరు


ప్రతి అంశాన్ని అడిగి తెలుసుకుంటున్నా



బోధన సమయంలో అర్థం కాని ప్రతి అంశాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుంటున్నాం. టీచర్లు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. ప్రత్యేక తరగతులకు క్రమం తప్పకుండా హాజరవుతున్నాం. మంచి మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలుస్తా.

– మల్లిక, పదో తరగతి


మంచి మార్కులు సాధిస్తా



ప్రత్యేక తరగతులు నిర్వహించడం వల్ల బోధన మెరుగు పడుతోంది. మంచి మార్కులు సాధించి మండలంలో టాపర్‌గా నిలుస్తా. మధ్య మధ్యలో పరీక్షలు నిర్వహించడం వల్ల మాలోని సామర్థ్యం, అలాగే ఏ సబ్జెక్టులో వీక్‌గా ఉన్నామో తెలుస్తోంది.

– కీర్తన, పదో తరగతి

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి



పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించేలా చర్యలు తీసుకున్నా. విద్యాశాఖ గైడ్‌లైన్స్‌ ప్రకారం బోధన చేస్తున్నాం. గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

– హరిశ్చందర్‌, ఎంఈవో, పూడూరు

పొలాలకు ‘కోట్‌పల్లి’ నీరు

సాక్షి ఎఫెక్ట్‌..

కోట్‌పల్లికి నీటి గండం శీర్షికన ఈ నెల 21న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. కోట్‌పల్లి ప్రాజెక్టు బేబి కెనాల్‌ తూము నుంచి నీరు వృథాగా పోయి కాగ్నా నదిలో కలుస్తోంది. దీనిపై ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు వృథాగా పోతున్న నీటిని బేబి కెనాల్‌కు మళ్లించారు. దీంతో వరినాట్లు వేసి నీటి కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఊరట లభించింది.

– ధారూరు



వృథాగా పోతున్న నీటికి వేసిన అడ్డుకట్ట